క్లుప్తంగా

కళాశాల పేరు మార్పు



రాయపర్తి : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇక నుంచి మల్లెల వెంకటేశ్వర్‌రావు స్మారక ప్రభుత్వ జూనియర్ కళాశాలగా నామకరణం చేశారు. 2001లో ఏర్పాటైన ఈ కళాశాల భవనాల నిర్మాణానికి మండలకేంద్రానికి చెందిన మల్లెల వెంకటరామారావు, పంచాయతీరాజ్ జిల్లాస్థాయి అధికారి మల్లెల శ్రీనివాసరావు సోదరులు ఎకరం భూమిని దానం చేశారు. దీంతో శాశ్వత భవనాల నిర్మాణాలను చేపట్టారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఆదేశాల మేరకు సవరిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వాకాటి కరుణ శనివారం జీఓ జారీ చేసినట్లు భూదాతల కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులతో భూదాతల కుటుంబ సభ్యులు హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

అంత్యక్రియలకు సాయం

గీసుకొండ : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ తన బాల్యస్నేహితుడు దొనికెల బాబు గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. కాగా, అంత్యక్రియలకు రూ.5వేల నగదు అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, నివాళులర్పించారు. సర్పంచ్ దొడు బాబు, పెద్దలు కర్ణకంటి రామ్మూర్తి, దొనికెల రాములు, నవీన్, పాగాకు కిష్టయ్య పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని చింతనెక్కొండలో గల విజ్ఞాన భారతి విద్యాలయంలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా కుడికాల ప్రశస్తి, ఎంఈఓగా గాయత్రి, కరస్పాండెంట్‌గా సందీప్, ప్రధానోపాధ్యాయుడిగా మణికంఠ, పీఈటీలుగా సాయిచందు, చరణ్, కార్తీక్, ఉపాధ్యాయులుగా నికిత, రశ్మిత, కార్తీక్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అక్కినపల్లి సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు భిక్షపతి, పద్మావతి, సంపత్, పాష, మౌనిక, సరిత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో దేవుడి మిగులు భూమికి ఎసరు?

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని అన్నారం షరీఫ్‌లో గుంషావళి, బొలేషావలి దర్గాల మధ్యలో దేవుడి మిగులు భూమి ఉంది. కాగా అదే గ్రామానికి చెందిన ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఆ భూమి తమదేనని చెబుతూ సుమారు రెండు ఎకరాల భూమికి గాను గుంటకు రూ.10లక్షల చొప్పున ఒక వ్యక్తి విక్రయించినట్లు సమాచారం. ఆ భూమి పట్టా ఎవరి పేరు మీద లేనందున అది తమదేనని తమకు పట్టా చేయించి ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. కాగా మిగులు భూమిని గుంషావళి, బొలేషావళి దర్గాలకు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18న ఎఫ్‌ఎస్‌సీఎస్ మార్టు ప్రారంభం

ఐనవోలు : నందనం రైతు సేవా సహకార సంఘం(ఎఫ్‌ఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తొలిసారిగా నిత్యావసర వస్తువుల విక్రయశాల ఎఫ్‌ఎస్‌సీఎస్ మార్టు పేరిట నిర్వహించనున్నారు. మార్టు ఈ నెల 18న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించనున్నట్లు సమాచారం. కాగా, ముందస్తు సన్నాహాల్లో భాగంగా శనివారం వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మార్టు వద్ద సూచిక బెలూన్‌ను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్ను కుమారస్వామి, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, డైరెక్టర్లు వడిచర్ల శ్రీనివాస్, రాజారపు రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బండి కంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై చిన్నచూపు తగదు

కాజీపేట: పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని, పెండింగ్‌లో ఉన్న అపరిష్కృత డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అసోసియేషన్ మహాసభలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సమావేశానికి సిద్ది రాజయ్య అధ్యక్షత వహించగా నారాయణగిరి వీరన్న, టి.మల్లేశం, డి.సాంబమూర్తి, ఆంజనేయులు, రఘుపతిరావు, సారంగపాణి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం

- లక్షల్లో పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు
- ఏళ్ల తరబడి చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- సామాన్యులే టార్గెట్‌గా వసూళ్లు
- కన్నెత్తి చూడని విద్యుత్ అధికారులు



సంగెం : నిత్యం వాడుకునే ప్రతి వస్తువుకు కచ్చితమైన చెల్లింపులు ఉంటాయి.. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో వాడుకునే విద్యుత్ బిల్లుల చెల్లింపులో అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కరెంట్ బిల్లు బకాయిలు లక్షల్లో పేరుకుపోతోంది. విద్యుత్‌ను వాడుకుంటున్న మండలంలో పలు ప్రభుత్వ శాఖలు నెలవారిగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని గృహవినియోగదారుల కనెక్షన్లు కట్ చేయడం విద్యుత్‌శాఖ అధికారులకు పరిపాటిగా మారింది. ప్రతి నెలలో గ్రామానికి మూడు, నాలుగు సార్లు వచ్చి సామాన్యుల నడ్డి విరిచి విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న అధికారులు మాత్రం ప్రభుత్వ కార్యాలయాల జోలికి వెళ్లడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రతి నెలా బిల్లులు చెల్లించకపోవడంతో వాటికి అపరాధ రుసుము సైతం తోడవుతూ బకాయిలు రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉంటున్నాయి. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ బకాయిలు సుమారు రూ.58లక్షల బకాయిలుండగా అందులో ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, జీపీలు, స్ట్రీట్ లైట్లు, పాఠశాలలు, వాటర్ ప్లాంట్లదే అగ్రభాగంగా ఉన్నాయి. ప్రతి నెలా బిల్లులు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ఆయా శాఖల బిల్లులు మాత్రం వసూలు కావడం లేదు. మండలంలో సింహభాగం రెవెన్యూ, పోలీస్‌శాఖలదే కావడం విశేషం.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ శాఖల్లోని పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. అన్ని రకాల బకాయిలు వసూలు చేయడానికి ప్రత్యేక టీంల ద్వారా స్పెషల్ డ్రైవ్ చేస్తున్నాం. బకాయిలు చెల్లించాలని అన్ని శాఖల అధికారులను కోరాం. ఎస్సీ, ఎస్టీలు తప్పకుండా మీటర్లు తీసుకుని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. మీటర్ లేకుండా విద్యుత్ వాడితే చర్యలు తీసుకుంటాం.

\- క్రాంతికుమార్, ఇన్‌చార్జ్ ఏఈ

ఫిబ్రవరి నెల వరకు బకాయిలు ఇలా..	
తహసీల్దార్ కార్యాలయం	రూ.4,30,274
పోలీస్‌స్టేషన్	రూ.66,069
ఎస్సై, సిబ్బంది గృహాలు	రూ.4,09,198
ప్రభుత్వ ఆస్పత్రి	రూ.1,15,299
ఎంపీడీఓ కార్యాలయం	రూ.70,269
గ్రామపంచాయతీలు	రూ.29,00,000
ప్రభుత్వ పాఠశాలలు	రూ.4,29,000
జీపీ వాటర్ ప్లాంట్లు	రూ.12,00,000

సామాన్యులపైనే ప్రతాపం చూపించే విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, జీపీలల్లో లక్షల్లో బకాయిలున్నా పట్టించుకోదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్ ప్రభుత్వ శాఖల విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


పనుల నమోదును తనిఖీ చేస్తున్న ప్రకాశ్

నల్లబెల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలని మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ అన్నారు. పల్లె ప్రగతి డీఎస్‌ఆర్ యాప్ తనిఖీలో భాగంగా మండలంలోని మామిండ్లవీరయ్యపల్లి గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య, అభివృద్ధి నిర్వహణ పనులను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ యాప్‌లో నమోదు చేసిన వివరాలను తనిఖీ యాప్‌లో నమోదు చేశారు. పనుల వివరాలను యాప్‌లో నమోదు చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ డీఎస్‌ఆర్ యాప్ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మేడపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఉన్నాడు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం : మండలంలోని అయోధ్యనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రకాశ్‌రావు శనివారం ప్రారంభించారు. అలాగే పాకాల ఆయకట్టు పరిధిలో చివరి భూముల వరకు గోదావరి జలాలను అందజేస్తామని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయకట్టు పరిధి కాల్వలను, షట్టర్‌లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పాకాల ఆయకట్టు పరిధిలో పూర్తిస్థాయిలో పంటలు సాగు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఐబీ సిబ్బంది పాల్గొన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సర్పంచ్‌లు జర్పుల అశోక్, వెంకన్న, పంచాయతీ కార్యదర్శి ఉషా, బీఆర్‌ఎస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు


దుగ్గొండి: లావణ్యను సన్మానిస్తున్న బాధ్యులు

దుగ్గొండి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతన విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో శనివారం శతాధిక కవయిత్రుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన గజ్జి లావణ్యను భద్రకాళి దేవస్థానం ఈఓ శేషుభారతి ఘనంగా సన్మానించి అవార్డును అందించారు. ఈ మేరకు అవార్డును అందుకున్న లావణ్యను పలువురు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

చెన్నారావుపేట : ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన సైన్స్ టాలెంట్ ఆన్‌లైన్ పరీక్షలో మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌కు చెందిన విద్యార్థి చల్లా యశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో యశ్వంత్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి సైన్స్ హంట్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి డీఎస్‌ఓ శ్రీనివాస్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌తో పాటు షీల్డ్ అందుకున్నాడని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అభినందించిన వారిలో హెచ్‌ఎం కర్ణాకర్‌రెడ్డి, జక్కుల జగదీశ్వర్, దామెర గణేష్, బొజ్జ విజయ్, విష్ణు, రాజు, తదితరులు ఉన్నారు.

16న ఆటో డ్రైవర్ల సమస్యలపై సమావేశం



కాజీపేట రూరల్: హనుమకొండలోని అంబేడ్కర్ భవనంలో ఈనెల 16వ తేదీన ఆటో డ్రైవర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కాజీపేట ప్రతాపరుద్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గద్దం నరహరి, సెక్రటరీ నాతి సత్యనారాయణ, ట్రెజరర్ శంకర్‌నాయక్ తెలిపారు. ఈమేరకు కాజీపేట ఆటో స్టాండ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సమావేశానికి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, నగర మేయర్ సుధారాణి, వరంగల్ సీపీ రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్యతో పాటు ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఆర్టీఓలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

డ్యూటీ మారినా.. డాక్టర్ పేరు మారలే?



బోర్డుపై మారని డాక్టర్ పేరు

నర్సంపేట రూరల్ : డ్యూటీ డాక్టర్ విధులు ముగించుకొని వెళ్లిపోయి, మరో వైద్యుడు వచ్చి విధులు నిర్వహిస్తున్నప్పటికి పాత పేరునే కొనసాగిస్తున్న సంఘటన నర్సంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రతి వైద్యుడు ఉదయం 10గంటలకు డ్యూటీకి వచ్చి మరుసటి రోజు ఉదయం 10గంటలకు డ్యూటీ దిగి వెళ్లిపోతుంటారు. అయితే సీహెచ్‌సీలో ఆస్పత్రి 10వ తేదీన డాక్టర్ రాజ్‌కుమార్ ఆస్పత్రిలో విధులు నిర్వహించి 11వ తేదీన విధుల నుంచి వెళ్లిపోయారు. 11వ తేదీన డ్యూటీకి డాక్టర్ కల్యాణి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. కానీ డ్యూటీ డాక్టర్ ఎవరో తెలుసుకునేందుకు ప్రజల కోసం ఏర్పాటుచేసిన బోర్డును ఏర్పాటుచేశారు. ఆ బోర్డులో మాత్రం డ్యూటీ డాక్టర్ పేరు మార్చకుండా ఉండడంతో వచ్చిన రోగులు, రోగులకు సంబంధించిన బంధువులు ఏ డాక్టర్ విధుల్లో ఉన్నారో తెలియక అయోమయంలో పడిపోతున్నారు. వైద్య సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని పలువురు ప్రశ్నించారు.

'బండి' వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్‌ఎస్


వర్ధన్నపేట: బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సంగెం మండల కేంద్రంలో..

వర్ధన్నపేట : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇటీవల ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం సాయంత్రం వర్ధన్నపేట అంబేడ్కర్ సెంటర వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఆయన దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంజయ్‌పై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ ఉన్నతమైన పదవిలో ఉండి నీచ రాజకీయాలు చేస్తున్నారని, ఒక ఆడబిడ్డపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, సుదర్శన్, పులి శ్రీనివాస్, కొండేటి శ్రీనివాస్, రామకృష్ణ, తుమ్మల రవీందర్, పెద్దబోయిన దేవేంద్ర పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

సంగెం : భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుండేటి బాబు, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, యూత్ మండల అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తం, నాయకులు ప్రవీణ్, రమేష్‌బాబు, రాజేష్, సాంబరాజు, భరత్‌రెడ్డి, స్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.

'మద్యం పాలసీని ప్రతిఘటిద్దాం'


సమావేశంలో మాట్లాడుతున్న ఎం.లక్ష్మి

నర్సంపేట : మహిళల జీవితాన్ని విధ్వంసం చేస్తూ శ్రామికుల కష్టాలను దోచుకుంటున్న పాలకుల మద్యం పాలసీని ప్రతిఘటించాలని స్త్రీ సంఘటన పత్రిక ఎడిటర్ ఎం.లక్ష్మి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఈర్ల పద్మ అధ్యక్షతన శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. 8గంటల పని దినం, సురక్షిత పరిస్థితులు, వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనానికి 150ఏళ్ల క్రితమే అమెరికా, తదితర దేశాల్లో మహిళా కార్మికులు పోరాటాలు సాగించారన్నారు. గడ్డ కట్టి చలి, మంచులో అనేక రకాల అవరోధాలు, ఆటోపోట్లు, పాలకుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూ సాగించిన పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులు సాధించుకోగలిగామని తెలిపారు. ఈ క్రమంలో 1910లో కోపెన్‌హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ మహిళల కాన్ఫరెన్స్‌లో జర్మనీకి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్ కిన్ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని ప్రతిపాదించారన్నారు. నాటి నుంచి నేటి వరకు అంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8శ్రామిక మహిళల సంఘటిత పోరాటాలు, హక్కుల సాధనకు సంకేతంగా నిలుస్తూ స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం స్త్రీ సంఘటన రాష్ట్ర కార్యదర్శి మోడెం శ్రీలత, డాక్టర్ నవత, మహిళా సంఘం జిల్లా నాయకులు మేక దేవేంద్ర, ఈరెల్లి శారద, పద్మ, శివరాత్రి స్వప్న, అజ్మీరా మమత, అనిత, శోభ, రాధిక, వనక్క, చన్నమల్ల సుజాత, శ్రీజ, తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్‌లో చేరిక

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ సీనియర్ నాయకుడు డాక్టర్ వడ్డెపెల్లి విజయ్‌కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీజేఎస్ పార్టీలో చేరగా ప్రొఫెసర్ కోదండరామ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ బచావో సదస్సులో ఆయన పార్టీలో చేరినట్లు తెలిపారు. తెలంగాణ కోసం కోదండరామ్ సబ్బండ వర్గాలను ఏకం చేసి అహర్నిషలు కృషి చేశారన్నారు.

బియ్యం అందజేత

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాయపురం రమేష్ కుమారుడు పండు ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా అల్లూరి యువసేన సేవ సమితి సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 25కేజీల బియ్యం అందజేశారు.

గృహోపకరణాలు దగ్ధం

గీసుకొండ : షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన మండలంలోని 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్ కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇదే కాలనీకి చెందిన గంధం విక్టర్ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు లేచాయి. దీంతో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వీటితో పాటు నగదు కూడా కాలిపోయాయని తెలిపారు. వరంగల్ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేసిందన్నారు. ఈ ఘటనలో సుమారుగా రూ. 2లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ బకాయిల చెల్లింపు



విద్యుత్ బకాయిలను చెల్లిస్తున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆర్థికసాయంతో గిరిజనుల విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించి సరఫరాను పునరుద్ధరించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. శనివారం వర్ధన్నపేట ఈఆర్‌ఓ కార్యాలయంలో డీసీతండాలోని 70 గిరిజన కుటుంబాల విద్యుత్ బకాయిలు రూ.2లక్షలను చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డీసీతండాలో విద్యుత్ రావడం లేదని విన్నవించుకున్నా పట్టించుకోలేదని, ఇటీవల బీజేపీ భరోసా యాత్రలో బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి రూ.2లక్షలను అందించారన్నారు. తండాలో కేవలం బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికే వారికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని, మిగతా వారిని పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం డీసీ తండా వాసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు, కొండేటి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేజా నాయక్, బానోతు ప్రవీణ్, ఆంగోతు మహేందర్, యాకూబ్, రవీందర్, సుమన్, హర్య,తారాబాయి, బుజ్జి, హంసు, సుమన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బీభత్సం

- మూడు నెలల్లో 49 మందిని గాయాలు
- నివారణ చర్యలు చేపట్టాలని వేడుకోలు


రహదారిపై గుంపులుగా ఉన్న వీధి కుక్కలు



రాయపర్తి : మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో వీధికుక్కలతో పాటు కోతులు స్వైరవిహారం చేస్తూ భయాందోళన సృష్టిస్తున్నాయి. కుక్కలు, కోతుల భయంతో ఒంటరిగా మహిళలు, పిల్లలు బయటికి వెళ్లలేని పరిస్థితి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ అడ్డొచ్చిన ప్రజలను గాయపర్చుతున్నాయి. రాత్రయితే చాలు గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ అరుపులతో నిద్రలేకుండా చేస్తున్నాయి. అరుస్తున్న కుక్కలను తరిమేందుకు ప్రయత్నించిన స్థానికులు గాయాల పాలవుతున్నారు. పిల్లలతో పాటు పెద్దలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రాత్రయితే కుక్కలు, పొద్దంతా కోతులతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కుక్కలు, కోతుల బారినుంచి కాపాడాలని కోరుతున్నారు.

జనవరి నుంచి 49 మంది బాధితులు

జనవరి నెలనుంచి ఇప్పటి వరకు పీహెచ్‌సీ రికార్డుల ప్రకారం 49 మందిని కుక్కలు, కోతులు గాయపర్చగా వైద్యంకోసం పీహెచ్‌సీకి వచ్చినట్లు వైద్యాధికారులు తెలుపారు. ఇంకొంత మంది వర్ధన్నపేట, తొర్రూరు మండలకేంద్రాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం చికిత్స పొందారు. ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు చొరవతీసుకొని కుక్కలను, కోతులను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గుంపులుగా తిరుగుతున్నాయ్



వీధుల వెంట కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. శునకాల నివారణకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. రాత్రయితే భయంగా ఉంటుంది. ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలి. పిల్లలను బయటకు పంపించాలంటేనే భయంగా గడుపుతున్నాం.

\-అరుణ్‌నాయక్, జయరాంతండా

టీకాలు వేస్తున్నాం..



కుక్కలు, కోతుల బారిన పడి కాటుకు గురైన బాధితులు పీహెచ్‌సీకి వస్తున్నారు. వారికి టీకాలు వేస్తున్నాము. మూడు నెలల్లో కుక్కలు, కోతుల బారిన పడిన వారు 49 మంది వచ్చారు.

\- వెంకటేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి

కేర్ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్

దామెర: కేర్ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, సెక్రెటరీ డాక్టర్ డి. సుధీర్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని కేర్ ఫార్మసీ కళాశాలలో శనివారం జాతీయ సెమినార్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సెమినార్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న సోమవారం బయో అనాలిటికల్ మెథడ్ డెవలప్‌మెంట్, చాలెంజెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ఫార్మస్యూటికల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టివి. నారాయణ, కామన్‌వెల్త్ ఫార్మసిస్టు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రావు వడ్లమూడి, జీనీరా ఫార్మ కంపెనీ సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల, స్పెషల్ గెస్టుగా రచయిత మిట్టపల్లి సురేందర్ హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.